# ఏమో అనుకున్నాను!

● రవిమిత్ర

నేనూ నా స్నేహితుడు రాజా విజయ వాడ ప్లాట్ ఫారం మీద సామాన్లతో సైతం నిలబడ్డాం. స్టేషన్ లో నానా గొడవనీ మించి మైక్ లో కర్ణకఠోరంగా "దయచేసి వినండి" అని హెచ్చరిక వినిపించింది.

"ఈయన ఎక్కడినుండి మాట్లాడు తున్నాడో తెలిస్తే అక్కడికే దయచేసి విందాం" అంటూ నవ్వటం మొదలెట్టాడు రాజా.

"గుంటూరు నుండి సికింద్రాబాద్ పోవు కృష్ణాఎక్స్ ప్రెస్ కొద్ది నిమిషంలలో 5వ నంబరు ప్లాట్ ఫారం మీదకు వచ్చును."

ప్లాట్ ఫారం మీద హడావుడి మొదలయింది. సామాన్లు ఎక్కడెక్కడో పారేసి పోజులను వృధా చేస్తున్న మా లాంటి కుర్రకారు తమ తమ సామాన్ల దగ్గరకు పరుగెడుతున్నారు. బొంబాయి బోగిని ట్రైన్ కు ఎటువైపు తగిలిస్తారో తెలియక బొంబాయి వెళ్ళే గౌన్లు, మాక్సీలు హడావుడి పడిపోతున్నాయి. మేమిద్దరమూ బొంబాయి వెడుతున్నాం కనుక వీళ్ళను అబ్జర్వ్ చేస్తున్నాం. అన్నట్లు మేం బొంబాయి ఎందుకు వెడుతున్నామో మీకు చెప్పలేదు కదూ. మీరయినా అడగరేం? అయినా మాకు తప్పదుకదా. వినండి. ఒకాయన ఉద్యోగాలు ఇప్పిస్తానంటే ఆయనకోసం బొంబాయి బయలుదేరాం.

కృష్ణా ఎక్స్ ప్రెస్ వచ్చింది. సామాన్లకోసం చుట్టూ చూసిన మాకు అవి కనపడలేదు.

"రాజా సామాన్లేవిరా" అన్నాను, గాభరాగా.

"అదేమిటి గురూ తెల్లచీరమ్మాయి దగ్గర వదిలేసాం కదా" అన్నాడు రాజా, ఇంకొక ఎర్రచీర వైపు చూస్తూ.

నాకు గాభరా ఎక్కువవుతున్నది. ఇంత జన సమూహంలో తెల్ల చీరమ్మాయి ఎక్కడ కనబడుతుంది? పైపెచ్చు చాలామంది తెల్ల చీరలు కడుతూ ఉంటారు. రాజామీద కోపం వచ్చింది.

"ఒరేయ్ రాజా ఎప్పుడూ అమ్మాయిల గొడవేనా. సామాన్లు వెతుకుదాం పద" అంటూ వాడిని బయలుదేరదీశాను.

కానీ రాజు నా జబ్బ పట్టుకుని "ఒరేయ్ ఆ పచ్చచీరమ్మాయినిచూడు. ఫిగర్ చూస్తే ఇంకా పెళ్ళయినట్టు లేదు. కానీ ఆబ్లౌజ్ మాచ్ కాలేదోయ్" అంటూ పెద్దగా మాట్లాడటం మొదలెట్టాడు. ఆ అమ్మాయి మావైపు కోపంగా చూసేసింది. పైగా ఆవిడతో చాలామంది మగవాళ్ళు వున్నారు. వాళ్ళంతా కలిసి మమ్మల్ని దేహశుద్ధి చేస్తారని భయపడి....

"రాజూ రైలు వచ్చేసింది. నువ్వు ఇట్లాగే ఫిగర్లు చూస్తూ తన్నులు తిను. నేను పోతున్నాను" అంటూ వాడిని వదిలించుకుని సామాను అన్వేషణ ప్రారంభించాను.

"ఏమిటి రైలు వచ్చేసిందా. మరి ఆ సంగతి చెప్పవేం" అంటూ రాజు కూడా నా వెనక బయలుదేరాడు.

ఎవరయినా తిడతారని చెప్పుకోటానికి భయపడతాడు కానీ మా రాజు మొదటి హాబీ 'అమ్మాయిలను గురించి పెద్దగా వ్యాఖ్యానం' చెయ్యటం. ఈ జబ్బు మా వెధవకి యూనివర్శిటీలో మొదలయింది. అక్కడి అమ్మాయిలు పెద్దగా పట్టించుకోకపోవటంతో జబ్బు ముదిరిపోయి హాబీ అయి కూర్చుంది.

"బొంబాయి బోగీ ట్రైన్ చివరలో తగిలిస్తారు. బొంబాయి యాత్రికులు యిది గమనించ ప్రార్థన" మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ వినబడింది.

కొంతసేపు వెతికినతర్వాత సామాన్లు కనబడినవి.

"తెల్లచీరేది గురూ" అన్నాడు రాజు, సామాను పోయినంత గాభరాగా.

"ముందు సామాన్లు తీసుకో. తరువాత చీరలు వెతకొచ్చు"ంటూ సామాను చేతికందించాను.

బొంబాయి బోగీ మా ఎదురుగా వస్తుండటంతో, అలవాటుప్రకారం అది ఆగకముందే బోగీలో ప్రవేశించాం. రిక్వెస్టు చేయటంవల్ల మా ఇద్దరి సీట్లు కిటికీ దగ్గర ఎదురెదురుగా పడ్డాయి. మా అదృష్టవశాత్తు (1) ఆ కిటికీలు ప్లాట్‌ఫారం వైపే వున్నాయి.

"చూడు నాయనా" అంటూ ఎవరో పిలిచినట్లనిపించి ప్రక్కకు చూస్తే ఒక ముసలావిడ నన్ను పిలుస్తున్నది.

'ఏమిటి మామ్మగారూ' అనబోయి వెనక ఒక అమ్మాయి వుండటంతో ఎందుకయినా మంచిదని—

"ఏమిటండీ" అన్నాను.

"చూడు బాబు 27 సీటు ఎక్కడ" అడిగింది మామ్మగారు.

అది నా ప్రక్కసీటు అవటంవల్ల 'ఇదే నండి' అని చూపించి నేను రాజు ప్రక్కగా కూర్చున్నాను. ముసలావిడ, ఆవిడతో వచ్చిన అమ్మాయి కూర్చున్నారు.

"ఏమిటమ్మా ఆడవాళ్ళ బోగీలో ఇవ్వమంటే బుకింగు క్లర్కు ఇక్కడ ఇచ్చాడు. ఇక్కడ ప్రయాణం చెయ్యాలంటే నాకు భయమే" అని అంటున్నది ఆ పిల్ల.

"ఛా. అదేమిటే సుమిత్రా, మన జాగ్రత్తలో మనం ఉండాలి. కానీ ఒంటరిగా ప్రయాణం చేసినందువల్ల యెటువంటి ప్రమాదమూ ఉండదు. అయినా ఎక్కువమంది ఆడవాళ్ళున్న చోటే

ఇటీవల దొంగతనాలు జరుగుతున్నాయవి పేపర్లలో చదవటంలేదూ" సాగతీస్తున్నది మామ్మగారు.

నా బుర్ర చురుగ్గా పని చేసింది. ఈ సుమిత్ర మామ్మగారి కూతురు. ఒక్కతే ప్రయాణం చేస్తున్నది. మనిషికి తగ్గ అందమైన పేరు. ఈ విధంగా మా ఇద్దరికీ ప్రక్క ప్రక్క సీట్లు ఇచ్చినందుకు బుకింగ్ క్లర్క్‌ను మనసులోనే అభినందించాను. ఇదంతా రాజుకు చెపుదామని వాడివైపు చూశాను. వాడు కళ్ళు, నోరు మూయకుండా ఆ అమ్మాయినే చూస్తున్నాడు.

"ఒరేయ్ రాజూ" అంటూ కుదిపాను.

"ఇంకా పెళ్ళయినట్టు లేదు బాస్" వీడు ఇన్ఫరెన్స్ మొదలెట్టేశాడు.


ఇక లాభం లేదనుకుంటూ—

"ఎక్కడిదాకా వెళుతున్నారండీ?" అన్నాను మామ్మగారితో. ఆ అమ్మాయి ప్రయాణం గురించి తెలుసుకోవాలనే నా ఉద్దేశం. కాని ఒక తెలుగమ్మాయి పరిచయం లేని అబ్బాయితో పుస్తకాలలో తప్పించి మాట్లాడదని పుస్తకాలు చదివి తెలుసుకోవటం వల్ల అటు నుంచి నరుక్కొద్దామనుకున్నాను.

కానీ, "బొంబాయి వరకండీ".... అంటూ ఆ అమ్మాయే సమాధానం యిచ్చింది.

"నిజంగా" రాజు ఆశ్చర్యం వెల్లడించాడు.

"అదేమిటండి ఆయన అంతగా ఆశ్చర్యపోతున్నారు" అంటూ ఆ అమ్మాయి నవ్వింది. చెప్పొద్దూ ముత్యాలేమైనా క్రిందపడ్డాయేమో ఏరుకుందా




మని వెంటనే క్రిందకు చూశాను. బహుశా అప్పటికే అవి ప్రక్కలకు దొర్లిపోయి ఉంటాయి. వాటికి బదులు మట్టికొట్టుకు పోయిన నా చెప్పులు కనబడ్డాయి. విసుగ్గా నేలకేసి కొట్టాను.

"బొంబాయిలో మాఅల్లుడు ఉద్యోగం చేస్తున్నాడు నాయనా...." చెప్పుకుపోతున్నది మామ్మగారు.

'అల్లుడు' అనే మాట వినగానే నా గుండె ఆగిపోయింది. రాజు యిన్ఫరెన్స్‌కు తిట్టుకున్నాను. యింతలో మామ్మగారే—

"మా పెద్దల్లుడికి బొంబాయిలో కంపెనీ ఉద్యోగం. ఇది ఆఖరిది..... రెండవది..." అంటూ ఏదో చెపుతున్నది. కాని అవి నా చెవిని పడటం లేదు. 'ఈ అమ్మాయికి పెళ్ళి కాలేదు' అనే విషయం వినగానే నా గుండె

ద్విగుణీకృత ఉత్సాహంతో పని చెయ్యటం మొదలెట్టింది.

"అబ్బ ఊరుకోవే. ఎప్పుడూ నీ పిల్లలగొడవ. నా పెళ్ళిగొడవ.ఇంతకీ మీరు ఎక్కడికి వెడుతున్నారో తెలుసుకో వచ్చా? ఈయన మీ స్నేహితుడా" అంటూ ప్రశ్నలవర్షం కుమ్మరించింది సుమిత్ర.

'తప్పకుండా' అంటూ మా రాజును ఆవిడకు పరిచయంచేసి, మా విద్యా వివరాలు ఆవిడకు చెప్పి (అందుకనే మీకు చెప్పలేదు.) బొంబాయి ఎందుకు వెడుతున్నామో గొంతు విప్పకోకుండా, ఇద్దరం ఆ అమ్మాయికి బుర్రకథ లాగా చెప్పేసాం.

"అయితే మీరు కూడా బొంబాయి దాకా వస్తున్నారన్నమాట. ట్రైన్‌లో మంచి కాలక్షేపం అవుతుంది కదమ్మా. అయినా ఏ అమెరికాయో వెళ్ళిపోండి, మంచిమంచి ఉద్యోగాలు దొరుకుతాయి" సలహా ఇచ్చింది సుమిత్ర.

"బొంబాయిలో మీ రెక్కడ ఉంటారు" మామ్మగారి ప్రశ్న.

"మా కెవరూ తెలిసినవాళ్ళు లేరండి" అని నేనంటుంటే....

"ఏదయినా మంచి హోటల్లో ఉందామనుకుంటున్నామండి" అని పూర్తి చేశాడు రాజు.

"బొంబాయిలో ఎన్నిరోజులుంటారో తెలుసుకోవచ్చా." సుమిత్ర ప్రశ్న.

"తప్పకుండా. నాలుగయిదు రోజులుండవలసి వస్తుందేమో. ఉద్యోగం సంగతి పూర్తిగా తేల్చుకుని గానీ బయలు దేరమండి" అని రాజు సమాధానం చెప్పాడు.

"అన్ని రోజులు బొంబాయిలో హోటళ్ళలో ఉండాలంటే చాలాఖర్చవుతుందేమో" మామ్మగారు అనుమానం వ్యక్తం చేసింది.

"మీ కభ్యంతరం లేకపోతే మా ఇంట్లో ఉండండి. మాకు అక్కడ తెలుగు మాట్లాడేవాళ్ళు లేక బోరుకొడుతుంది. మీరున్న నాలుగు రోజులయినా తెలుగు వాళ్ళతో గడిపామనే తృప్తి ఉంటుంది." అన్నది సుమిత్ర, ఆహ్వానిస్తున్నట్లుగా.

(చదువరీ... ఇటువంటివి నిజ జీవితంలో జరుగుతాయా అని నీకు అనుమానం రావచ్చు. నువ్వదృష్టవంతుడివయితే తప్పకుండా యిలాంటివి జరుగుతాయి.)

"ఓ ష్యూర్" అంటూ రాజు ఏదో మాట్లాడ బోతుంటే....

"మీ అడ్రసివ్వండి. మిమ్మల్ని తప్పకుండా వచ్చి కలుస్తాము." అని మర్యాద కాపాడుకున్నాను.

ఆ అమ్మాయి తన బావగారి విజిటింగ్ కార్డ్ ఇచ్చింది. కార్డ్ పెద్దదవటంవల్ల చేతివేళ్ళు తగలక పోవటంతో తిట్టుకోవలసి వచ్చింది.

"ఇఫ్ యూ డోంట్ మైండ్. కాసిని మంచినీళ్ళు తెచ్చిపెడతారా. పంపు నాకెక్కడా కనిపించటంలేదు." అంటూ మరచెంబు తీసింది సుమిత్ర.

"ఓ ష్యూర్" (మా రాజు ఊతపదం) అంటూ మరచెంబు తీసుకుని తలుపు వైపు పరిగెత్తాడు రాజు. చేతి వేళ్ళుకూడా తగిలినట్లున్నాయి.

వెధవకి.

"మీ ఫ్రెండ్ చాలా ఏక్టివ్‌గాఉన్నా రండి. ఐ లైక్ ఏక్టివ్‌నెస్" అన్నది సుమిత్ర.

నేననుకున్నంతా జరిగింది. రాజు ఆవిడ దగ్గర ఇంప్రెషన్ కొట్టేశాడు. 'నువ్వొత్త ఫూల్‌విరా' అని ఎవరో లోపలనుంచి చెప్పినట్లనిపించింది.

"నిజమే." అనేశాను పైకి.

"ఏమిటి నిజమేనంటున్నారు."

తెలివి తెచ్చుకున్న నేను, "నిజమే నండీ మా రాజు ఫ్రెండ్సందరిలోకీ చురుకైనవాడు. చూశారా అప్పుడేమంచి నీళ్ళు తెచ్చేశాడు." అంటూ రాజును చూపించాను.

"ఎక్కడ తెచ్చారండీ నీళ్లు ? నా కెక్కడా పంపు కనపడలేదు."

"అవతలి ప్లాట్‌ఫారంమీద కొళాయి ఉన్నదండి. అక్కడి నుండి తెచ్చాను."

"థాంక్స్ ట్రబులిచ్చానేమో" నొచ్చుకున్నది.

"నాచెటాల్. ఎవరి అవసరం వాళ్ళది." రాజు కూర్చున్నాడు.

వీడివరస చూస్తే కొంత సేపటికి ఈ అమ్మాయి నా ఉనికినే మరిచిపోయే ట్లు చేస్తాడు. అనుమానంలేదు. అసలు పొరపాటునాది వీడే లేకపోతే చక్కగా బొంబాయి వరకు, ఆ తర్వాత బొంబా యిలో కూడా ఈ సుమిత్ర కంపెనీ కొట్టేసేవాడిని. నా ప్లాన్ అంతా చెడ గొట్టేందుకే ఉన్నాడు రాజు.

"గుంటూరు నుండి సికింద్రాబాద్ పోవు కృష్ణా ఎక్స్‌ప్రెస్ కొద్దినిముషా లలో 5వ నం. ప్లాట్‌ఫారం నుండి బయలుదేరును." ఎనౌన్స్‌మెంట్ విన బడింది.

తల్లి కూతుళ్ళిద్దరూ తలుపు దగ్గర నిలబడి మాట్లాడు కుంటున్నారు. 24 గంటలు సుమిత్రతో ప్రయాణంచేస్తాను కదాని ఆ అమ్మాయిని గురించి ఆలో చించటం మానేశాను. కాని రాజు మాత్రం....

"తెలుగు అమ్మాయిలు ఇంత బాగుం టారని నేననుకోలేదు బాస్. పిల్లచాలా బాగుంది. నువ్వు హెల్ప్ చేస్తావా. నాకొది లేస్తావా."

"చూడు రాజా నీ కెప్పుడూ అమ్మా యిల గొడవే. ఈ అమ్మాయితో మనం ప్రయాణంచేస్తాం కాబట్టి, మనం అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. నువ్వు కాస్త డీసెంట్‌గా బిహేవ్ చెయ్యి. "ప్లీజ్" ప్రతిమాలాను.

"ఆల్ రైట్" అని రాజు భరోసా ఇస్తుండగానే, రైలు కూతవేసి బయలు దేరింది. కానీ ఆ అమ్మాయి లోపలకు రావటంలేదు. ఆ అమ్మాయే నాదగ్గరకు వచ్చి...

"చాలా థాంక్సండి. బొంబాయి దాకా మా అమ్మను చూస్తుండండి. ప్లీజ్. ఆల్ ది బెస్ట్."

"అదేమిటీ మీరు రావటంలేదా." రాజా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

ఆ అమ్మాయి సమాధానం నాకు వినపడలేదు. అనవసరంగా రాజా దగ్గర బయటపడిపోయానే అనిపిస్తోంది. ఆ అమ్మాయి వాళ్ళ అమ్మకు టాటా చెపుతున్నది కానీ నాకు మాత్రం బైబై కొట్టినట్లుగా అనిపించింది.

ఇంతలో రాజా నా దగ్గరకువచ్చి "గురూ ఆ చివరే బోలెడు మంది అమ్మాయిలు బొంబాయి ఎక్స్‌కర్షన్‌కు వెడుతున్నారు. అందులో ఒకమ్మాయే" అంటూంటే ...

"నువ్వు నోరు మూసుకుని నన్ను కాసేపు వదిలేయ్" అని నేను కసురుకోవటంతో "ఓ ష్యూర్"అంటూ వాడు ఆ చివరకు వెళ్ళిపోయాడు.

"ఏమో అనుకున్నాను. ఏమేమో అనుకున్నాను" అంటూ విని పిస్తే పక్కకు చూశాను. వెక్కిరిస్తున్నట్లుగా ట్రావెల్స్టర్ కనపడింది.

*

# ఓ ఆత్మకథ

ప్రజలే నా 'లవర్స్'
వారికోసమే నా 'ట్వెంటిఫోరవర్స్'
క్రమశిక్షణ లేనివారంటే
నాకు ఒళ్ళుమంట
అందుకే వారిదగ్గరగా కాక
మరెక్కడో ఆగుతుంటా.
నాకిద్దరే యిద్దరు 'దోస్తులు'
వారెప్పుడూ వేస్తారు కాకీ 'దుస్తులు'
అప్పుడప్పుడూ నాకొస్తాయి 'ట్రబుల్స్'
అప్పుడు హెల్ప్‌కని వెడతారు మా
'బ్రదర్స్'
ఈలవేసినా కొందరు తప్పుకోరు
అటువంటివారినెవరేం చేయగలరు...?
అన్యాయం పెరిగిపోతే
అక్రమాలెదుర్కో లేకపోతే,
తలబ్రద్దలు చేసేసుకుంటా
అటువంటప్పుడే నా ప్రజల్ని
మరుస్తూంటా
కులమత భేదం ప్రశక్తిలేదు
బీదాగొప్పా తేడా లేదు
నాకు కావల్సింది 'పంక్చుయాలిటీ'
అది మిస్సవుతూంటుంది. నా మిత్రుల
మూలంగా
ఇంతకీ నేనెవరినో తెలుసా ?
ఆర్టీసీ బస్సును
నే కోరేదెప్పుడూ ప్రజాశ్రేయస్సును.

—యం. మహేశ్వర్